శ్రీ రమణ జ్యోతి
జనవరి 2018
Sri Ramana Jyothi
January 2018

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.ఎస్. గారి 44వ ప్రవచనము | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | విజయనగరం 'రమణస్వామి' | | 8 |
| 3. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | డా॥ వి. రామదాస్ మూర్తి | 10 |
| 4. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 14 |
| 5. | భగవాన్ స్వప్న దర్శనం | ఐ.ఎస్.ఆర్. శర్మ | 17 |
| 6. | భగవాన్ రమణుల దైవిక లీలలు | విడవనకంటి | 19 |
| 7. | కదలని తెర - అసలు నేను | దోనెపూడి వెంకయ్య | 24 |
| 8. | Desire is digesting us; Time is 'spending' us! | Dr. K. Subrahmanian | 26 |
| 9. | Does the Mind Exist in Deep Sleep? | D. Samarender Reddy | 30 |
| 10. | Command of the Divine Mother | | 33 |
| 11. | "The World Has Waited Long For Your Arrival" - Kaavyakanta | V. Krithivasan | 34 |
| 12. | Ramana Sadguru | Alan Chadwick | 38 |
| 13. | Hridaya Guha | Janet Rubinson | 42 |

**Events in January 2018 in Sri Ramana Kendram, Hyderabad**

7th January: Bhagavan's 138th Jayanthi Celebrations - 9.00 - 11.45 a.m.
11th January: Dr. K. Subramaniam's 20th Memorial Day - 6.00 - 7.30 p.m.
All are requested to participate.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# శరణాగతి

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 44వ ప్రవచనము

(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## ఆకలి విలువ గుర్తించాలి

మాంబళంపట్టుకు రైలు ఛార్జి రెండు అణాలు. హోటల్ యజమాని తిరిగి ఇచ్చిన డబ్బుతో మాంబళంపట్టుకు టికెట్ కొన్నాడు. అక్కడి నుండి తిరువణ్ణామలైకి నడిచి వెళదామనుకొన్నాడు. అలా మండుటెండ లో నడిచి వెళ్తుంటే, బాగా అలసిపోయాడు. తిరుక్కోవిలూర్ దగ్గర అర్రయనల్లూర్‌లో ఒక గుడి కనిపించింది. లోపలికి వెళ్ళి ధ్యానంలో కూర్చున్నాడు. గర్భగుడి లింగం నుండి ఆశ్చర్యపడే కాంతి కనిపించింది. మళ్ళీ ధ్యానం చేస్తుంటే, పూజ ముగించుకుని వెళ్తున్న అర్చకుడు ఎవరూ లోపల లేకపోతే తలుపులు వేస్తానంటున్నాడు. అక్కడ వుండ డానికి వీలు లేదన్న అర్చకుడు బాలుడు అడిగితే, తినడానికి కూడ ఏమీ ఇవ్వనన్నాడు. దగ్గరలో మరొక దేవాలయం ఉన్నదంటే అక్కడికి వెళ్ళాడు. అక్కడ కూడ పూజ తరువాత తినడానికి పెట్టమంటే అర్చకుడు ఇవ్వనన్నాడు. ఆశ్చర్యంగా దేవాలయంలో డోలు వాయించే వ్యక్తి తనవంతు ప్రసాదాన్ని బాలునికి ఇమ్మన్నాడు.

గమనిస్తే, శాస్త్రజ్ఞానం తెలిసిన వ్యక్తి, నిరంతరం ప్రభువుకు సేవ చేసే అర్చకుడు, ఆకలితో ఉన్న బాలునికి ఆహారం ఇవ్వలేదు. అతనికి శాస్త్రజ్ఞానం ఉందేమో గాని హృదయం లేదన్నమాట. కాని ఏ శాస్త్రమూ తెలియని వాద్యగాడు మంచి హృదయంతో స్పందించాడు. తరువాతి కాలంలో భగవాన్ రమణమహర్షిగా ప్రసిద్ధికెక్కాక ముందు, ఆ బాలుడిని మొదటి రోజుల్లో దర్శనానికి వచ్చి సేవించుకున్న వాళ్ళు కూడ నిరక్షరాస్యులు, హరిజనులు, పేద విధవ స్త్రీలు. పిమ్మట ఎప్పుడో

పండితులు, ఇతర విద్యావంతులు దర్శించుకొని భగవాన్‌గా గుర్తించారు. అందుకే భగవాన్ ఒక దశ వరకే శాస్త్రజ్ఞానం ఉపయోగ పడుతుంది, ఆ తరువాత అది అహాన్ని పెంచుతుందే తప్ప సహృదయం పెంపొందడానికి పనికి రాదనేవారు.

డోలు వాయించే వ్యక్తి ఆహారాన్ని ఇచ్చినప్పటికీ, కొద్ది దూరం నడవక ముందే, అలసటతో ఆకును ఒక అరుగుమీద ప్రక్కన పెట్టి మూర్ఛపోయాడు. తరువాత ఎవరో ముఖంపై నీళ్ళు చల్లితేగాని తేరు కోలేదు. ప్రక్కరోజు గోకులాష్టమి. నడుస్తూ ముత్తు కృష్ణ భాగవతార్ అనే గృహస్థు ఇంటి దగ్గరకు వచ్చాడు. అక్కడ ఆహారం కోసం అడిగితే, ఆ గృహిణి బైటకు వచ్చి బాలుడిని చూసి సంతోషించింది. పండుగ రోజున కృష్ణుడే వచ్చాడన్న భావనతో వెంటనే భోజనమిచ్చింది. ఇదీ ఒక ఆశ్చర్యమే! సాయంత్రం దాకా ఆగు, నైవేద్యం పెట్టాక నీకు ఇస్తానన కుండ అప్పటికప్పుడు అతని ఆకలి తీర్చింది! అలసిపోయిన తాను తిరువణ్ణామలై వెళ్ళగలనా అనుకొంటూ, ముత్తుస్వామి భాగవతార్‌ను, తన చెవి బంగారు, రాళ్ళ కమ్మలను తాకట్టు పెట్టుకొని, నాలుగు రూపాయలు ఇమ్మని అడిగాడు. తాకట్టు పెట్టుకొని, ఇచ్చిన డబ్బుకు రసీదు కూడ ఇచ్చాడు. డబ్బు వాపసు చేసినప్పుడు ఆభరణాలను తిరిగి ఇస్తానన్నాడు. ఆయన భార్య పండుగ కారణంగా వండిన ఆహారాన్ని ముందే అతనికి ఇచ్చింది. ఆమె భావనలో కృష్ణుడే ఆ రోజు తమ ఇంటికి వచ్చినట్లు. తిరుక్కోయిలూర్ వెళ్లే దారిలో రసీదును చింపి పడేశాడు. తాను తిరిగి వచ్చే ప్రసక్తి లేదు గనుక దాని అవసరం ఇక లేదనుకొన్నాడు. నాలుగు అణాలకు రైలు టికెట కొని ఆరుగంటలకు తిరువణ్ణామలై చేరాడు.

### గమ్యం చేరిన భగవాన్

అరుణాచలేశ్వర ఆలయం దగ్గరకు వచ్చిన భగవాన్ ఆలయ

గోపురాన్ని చూసిన వెంటనే ఆనందంతో తబ్బిబ్బయ్యాడు. ఆలయంలోనికి వెళ్ళగా, ఆశ్చర్యం, ఆ సమయానికి గుడిలో ఎవ్వరూ లేరు. గర్భగుడిలోనికి వెళ్ళి, కన్నీళ్ళతో, "తండ్రీ, నేను వచ్చాను" అన్నాడు. ఆ ఉదంతం గురించి తరువాత ఎప్పుడో చెబుతూ, "నాకు మరణానుభవం కలిగినప్పటి నుండి అరుణాచలం చేరే వరకు తలనొప్పి నిరంతరం బాధిస్తూ ఉండేది. ప్రభువు దర్శనం చేసుకుని తమ రాకను తెలిపేసరికి ఆ నొప్పులన్నీ మాయమయ్యాయి" అన్నారు.

అసలు భగవాన్ యొక్క జీవితమే శరణాగతిపై ఒక వ్యాఖ్యానమని చెప్పవచ్చు. భగవంతుని లీలలు చిత్రంగా ఉంటాయి. దేవాలయం నుండి భగవాన్ బయటకు రాగానే, క్షురకుడొకడు క్షవరం (గుండు) చేయాలా అని అడగడం, ఆయన అంగీకరించడమూ జరిగాయి. పుణ్య క్షేత్రాల దర్శనమప్పుడు తలనీలాలనివ్వడం మామూలుగా చూస్తుంటాము. జాగ్రత్తగా పెంచుకున్న జుట్టును తీసివేయడం ఒక పరిత్యాగంగానే భావించాలి. ఆ తంతు పూర్తయిన తరువాత మరుసటిరోజుకు అవసరం కావచ్చుననే వేరే ఆలోచన లేకుండ తమ దగ్గర మిగిలిన చిల్లర, మిఠాయిలు విసిరి పారేసిన ఆ పిన్న వయస్కునికి భగవంతునిపై అంత భరోసా ఉండడం, ఎంత ఆలోచించినప్పటికి సాధారణ చర్యకు అతీతమైనదే! కట్టుకున్న పంచెలో నుంచి ఒక ముక్కను చించి, కౌపీనంగా ధరించి పంచెను కూడ విసిరేశారు. అది పరిత్యాగానికి పరాకాష్ట. ఇక స్నానం కూడ ఎందుకనుకొనే సమయంలో తిరువణ్ణామలైలో రెండేళ్ళగా కురవని వాన కుంభవృష్టిగా కురిసి స్నానం చేయించింది. ఇంతకూ ఆ రోజు తిండి లేదు. భగవదేచ్ఛ అని ఊరకున్నారు. ప్రక్కరోజు అర్చకుడొకరు ఈ బాలుడు ఏమీ తినలేదని గుర్తించి తుప్పు పట్టిన రేకుపై చద్దన్నం, కాస్త పచ్చడి ఇచ్చాడు. దానిని అరుణాచలేశ్వరుని ప్రథమ ప్రసాదంగా స్వీకరించారు. అలాగ భావించడం భగవంతుని కృప కలిగినప్పుడు తప్ప జరగదు.

## సందర్శకుల పట్ల ప్రేమాభిమానాలు

భగవాన్ తిరువణ్ణామలైలో ఉండిపోయిన తరువాతి రోజుల్లో వారి ప్రవర్తనలో స్వీయానుభవం పూర్తిగా ప్రతిఫలించింది. ఆకలి ప్రభావాన్ని గుర్తెరిగిన వారు సందర్శకులను ఎప్పుడూ మీరెవరు, ఎందుకు వచ్చారు, ఎప్పుడు వెళ్తారు - అని ఏనాడూ అడగలేదు. కాని భోజనం చేశారా?, భోజనం చేయండి అని మాత్రం తప్పకుండ చెప్పేవారు. తాము హాలులో కూర్చొని వుంటే, అడుగుల చప్పుడు వినిపిస్తే - అది రాత్రి 11, 12 గం॥ల సమయం అయినప్పటికి - రాబోయే వారి భోజన సదుపాయాలను చూడమని పరిచారకులకు చెప్పేవారు. అలాగే, ఎవరైనా ఆశ్రమ భోజన సమయానికి ముందే ప్రయాణించాల్సి వస్తే, అప్పటికి సిద్ధమైన ఆహారం ఏదైనా, కనీసం పెరుగన్నమైన సరే, తినివెళ్ళ మనేవారు. కాని ఖాళీ కడుపుతో పంపేవారు కాదు. కారణాలు అడిగిన వారికి ‘‘నాకు ఆకలి అంటే ఏమిటో బాగా తెలుసును’’ అనేవారు. హాలులో తాము సందర్శకులతో సంభాషిస్తున్నప్పుడు, భోజనశాల గంట మధ్యాహ్నం (11.30 గం॥కు) మ్రోగితే, మాటలు వెంటనే చాలించి, భోజనశాలకు బయలుదేరేవారు. కొందరు చర్చ ముగించిన తరువాత వెళ్ళవచ్చు కదా, అంటే, వారి జవాబు ఎంతో అర్థవంతంగా ఉండేది. ‘‘మన భోజనం కోసం వంటశాల కార్యకర్తలు తెల్లవారు జామున 4 గం॥ల నుండి శ్రమిస్తారు. మనం ఆలస్యం చేస్తే ఎక్కువ సేపు కాచుకొని, ఆకలితో వుంటారు. అందులోనూ వైధవ్యం పొందిన స్త్రీలు ఉదయం నుండి ఏ ఆహారమూ తీసుకోరు. వాళ్ళకు మనం ఇబ్బంది కలిగించినవారమవుతాము. అవసరమైతే, మనం భోజనం తరువాత మాట్లాడుకోవచ్చు’’ అనేవారు. ఇతరుల గురించి భగవాన్ అంతగా ఆలోచించేవారు.

ఇల్లు వదలి, అందరినీ వదలి, తిరువణ్ణామలై వచ్చి, క్రొత్త స్థలంలో క్రొత్త వ్యక్తిగా భావించకుండ, తనను రమ్మన్న అరుణాచలేశ్వరునిపై

మొత్తం భారం వేసి, నిశ్చింతగా వున్న ఆ పదిహేడేళ్ళ బాలుని వైరాగ్య భావాన్ని మనం, ఇన్నేళ్ళ తరువాత, ఇప్పుడు కూడ మెచ్చుకొని, ఆశ్చర్య పడక తప్పదు. భగవాన్ రచించిన ఒక పద్యంలో వారు, ‘‘ఓ అరుణాచలా! నీవే నా తల్లి, తండ్రివి. మాయాపూరితమైన ఈ అగాధ సంసారసాగరంలో పడకముందే, అత్యంత కరుణతో నా మనసును బలవంతంగా లాగి, నీ పాదాల క్రింద ఉంచుకున్నావే!’’ అన్నారు. దేవుడు మనల్ని పూర్తిగా అదుపులోనికి తీసుకొంటే, మనకు పూర్తిగా స్వతంత్రం వచ్చినట్లే. మన స్వంత మనసుతో స్వతంత్రంగా వున్నామని అనుకుంటే, అన్ని సమస్యలలో చిక్కుకుంటాము. అందుకే పూర్తిగా శరణాగతి చెంది, అన్ని విషయాలను ఆయనకు వదలిపెడితే, ఈ ప్రపంచంలో జరిగే ప్రతి ఒక్కటి ఆయన ఇచ్ఛ అనే భావన కలుగుతుంది. మన బాధ్యతలను పూర్తిచేసే శక్తి ఆయనే ఇస్తాడు. శక్తి కొద్ది నెరవేర్చినప్పుడు, చర్య విజయవంతమైనదా లేదా అని దిగులు పడనవసరం లేదు. ఎందుకంటే చేసేది మన కోసం కాదు, ఆయన కోసం గనుక.

కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం. పనియొక్క ఫలితం ఆయనే ప్రసాదిస్తాడు. కనుక ఫలాపేక్ష లేకుండా పనిచేయాలి. ప్రతి పని ఆయన కోసమని భావిస్తే, ఆయనే అభయమిస్తాడు. మీరు ప్రేమించే వ్యక్తి కోసం పనిచేయాలనుకొంటే, ఉత్తమంగా చేస్తారు. ఫలిస్తుందా లేదా అని విచారించము, ఎందుకంటే, అతడు క్షమిస్తాడు కాబట్టి. శరణాగతిలో భగవంతుని దయవల్ల చేస్తున్నామన్నప్పుడు, సుఖదుఃఖాలంటూ వుండవు. శాంతి ఒక్కటే మిగులుతుంది. మనం కోరవలసినది ఒక్కటే. ప్రభూ! ఎప్పుడూ నిన్ను తలచుకొనేటట్లు చేయి అని. ఎందుకంటే ఆయన కృప లేనిదే ఆయనను తలచుకోలేము కూడ!

# విజయనగరం రమణస్వామి

(రమణస్థాన్, విజయనగరం, వారు ప్రచురించిన "రమణ పాదసన్నిధిలో" అన్న పుస్తకం నుండి గ్రహించబడినవి) (గత సంచిక తరువాయి)

* నీకు నీవు సంపూర్ణంగా అవగతం కానంతవరకు, ఎంత సరిదిద్దు కున్నా పొరబాటు రెప్పపాటుగానైన కనిపించి తీరుతుంది.
* సత్యం సర్వులకు అనుభవమే. అది నీవే. లేనిదాన్ని చర్చించడం కంటే, నీవుగా నీలో ఉన్నదాన్ని గ్రహించడమే ఉత్తమం.
* మన నిజస్థితి మౌనమే. అది అవిభాజ్యం. మౌనంపై తేలియాడే భావనామాత్రపు వస్తువే మనస్సంటే. అస్థిర ప్రకాశమే మనస్సు. స్థిరమైన మౌనమే నిరంతరము.
* నిజము, సత్యము, రెండూ ఒకేలా కనిపించినా, వాటి మధ్య చాలా తేడా ఉంది. కంటికి కనిపించేదానిని నిజమంటారు. కంటికి ఆధార వస్తువును సత్యమంటారు. సత్యము ఎన్నడూ నిరూపణకు అందదు.
* సముద్రంగా ఉండేది నీరే, అలలుగా కనిపించేది నీరే, ఆలలపై కనిపించే నురగ నీరే. సముద్రమంతా ఘనీభవించినా అదీ నీరే. నీటిపై బుడగ నీరే. నామరూపాలు ఆపాదించాము గాని అన్నింటా ఉండేది సత్యమైన ఉనికి ఒక్కటే. అది మనలోనే మనదిగా ఉంది. అది అవిభాజ్యం.
* శరీరంతో శోధించినవాడు సంసారి అవుతాడు. తనలో శరీరమన్న భావన పుట్టుచోటును శోధించినవాడు సత్పురుషుడవుతాడు.
* ఈ శరీరమే నేను అనుకోవడం పెద్ద ఇబ్బంది అని సున్నితంగా ఒప్పుకోక అజ్ఞానం, అవిద్య, అశాంతి, జన్మ, కర్మ అన్న పేర్లతో భారంగా చెప్పుకుంటాము.
* మనస్సున్నంత కాలం విచారణ తప్పదు.
* మన దోషములను సంస్కరించవలసిన బాధ్యత గురువు ఒక్కడిదే.

నాకోసం అతడున్నాడన్న స్వచ్ఛమైన పూనిక చాలు.

* జాలరి వలను ఉపయోగించి చేపలను ఏ విధంగా పట్టుకుంటాడో అట్లే మాయ శరీరాన్ని ఉపయోగించుకొని విషయాలను సేకరిస్తుంది. జాలరికి వల వశమైనట్లు మాయకు శరీరం వశమవుతుంది. ఇది మాయ అని తెలిసి మాయను అంగీకరించడమే మాయను జయించడం.
* ఇంద్రియ సమూహమును శరీరము అంటారు. కోరికల స్వభావాన్ని మనస్సు అంటారు. స్వభావ అనుభవ విశ్లేషణను బుద్ధి అంటారు.
* దుఃఖమునకు కారణం ప్రపంచం కాదు. మనలోని ద్వంద్వమనే అర్థంలేనితనమే.
* ముక్తి, మోక్షం, గురించిన మాటలను ప్రక్కనపెట్టు. నీవు ఆత్మవని గుర్తెరుగు.
* సత్యం ఎప్పుడూ మరుగవదు. అది సత్యం కాదు.
* ముక్తి, మోక్షం, నిర్వాణం, కైవల్యం అన్నీ సహజస్థితికి పర్యాయపదాలు. సదాసహజ స్థితిలో ఉంటే, పర్యాయాలతో పనిలేదు.
* హృదయగుహలో స్థిరనివాసమేర్పరుచుకో. నిలకడ అనేది నివృత్తిలోనే ఉందని తెలుసుకో. ప్రవృత్తి అంతా పరాయి సొత్తని తెలుసుకో, సుఖపడతావు.
* 'నేను' లేక 'నాది' అనేది లేదు. 'నాది' లేకపోయినా 'నేను' న్నాను.
* బంధమే భయానికి కారణం. ఆసక్తే కర్మకు కారణం. ప్రీతే పాప పుణ్యాలకు కారణం.
* ఇతరానుభవం నుండే పరం పుట్టింది. పరమనేది ప్రత్యేకముగా లేనేలేదు.
* శరీరభావన ఉన్నంత కాలం పూర్ణ స్వేచ్ఛను పొందడం కుదరదు.

# శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

డా॥ కె. సుబ్రహ్మణియన్

- డా. వి. రామదాస్ మూర్తి

హైదరాబాద్‌లోని శ్రీరమణ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు, డా॥ కె. సుబ్రహ్మణియన్ (డా॥ కె.ఎస్) గారు ఒక ఉపాధ్యాయులు, రచయిత, సంపాదకులు, వక్త. అన్నిటినీ మించి వారు శ్రీ భగవాన్ రమణ మహర్షిగారి యొక్క జీవితకాల భక్తులు. జననం 28 ఏప్రిల్ 1928 తల్లిదండ్రులు (శ్రీ వి.ఎస్. కృష్ణస్వామి అయ్యర్, శ్రీమతి సరస్వతి అమ్మాళ్ గార్లు) స్వయాన రమణభక్తులు కావడంతో, కె.ఎస్. గారికి పసితనంలో (2 ఏళ్ళు)నే ప్రథమంగా రమణమహర్షి సమక్షాన వుండగలిగే పరమ భాగ్యం అబ్బింది. గృహ వాతావరణం అనుకూలంగా వుండబట్టి, కె.ఎస్. గారి చిన్నతనమంతా భగవాన్ గురించిన విషయాలు, వారి ఉపదేశ వాక్యాలు వినే అవకాశం ఏర్పడింది. దానికి తోడు మహర్షి అనుయాయులు శ్రీ విశ్వనాథ స్వామితో పరిచయం మరింత దోహద పడింది.

తండ్రిగారి ఉద్యోగబదిలీతో కె.ఎస్. గారిని తిరుకట్టుపల్లిలో బోర్డింగ్ స్కూలులో 1941 సం॥లో చేర్చవలసి వచ్చింది. చదువు, వసతి ఖర్చుల కోసం తండ్రి పంపుతూ వచ్చిన డబ్బులో కొంత వెచ్చించి కె.ఎస్. గారు భగవాన్‌కు తఱచు వేరు వేరు సందేహాలపై జాబులు వ్రాస్తుండే వారు. ఆశ్రమంలోని చిన్నస్వామిగారు తప్పక జవాబులు వ్రాస్తూ, భగవాన్ ప్రసాదాన్ని పంపేవారు. తరువాత ఒకసారి కె.ఎస్. గారు భగవాన్‌ను సందర్శించినప్పుడు వారు కె.ఎస్. గారిని "నీవేనా జాబులు వ్రాసేది? మీ తండ్రి నాకు జాబులు వ్రాయడానికి డబ్బు పంపిస్తున్నారా?" అని అడిగారట. మహర్షి తనతో మాట్లాడినందుకు

కె.ఎస్. గారు ఎంతో మురిసిపోయి, సిగ్గుతో కుంచించుకు పోయారట.

మదురైలో 1945 సం॥ ప్రాంతంలో కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఒకసారి కె.ఎస్.గారు రమణాశ్రమం వెళ్ళినప్పుడు దర్శన మందిరం వైపు వెళ్ళుతుండగా, భగవాన్ దోవలో ఒక భక్తునితో మాట్లాడుతూ, ఒక క్షణం కె.ఎస్. గారి వైపు దృష్టి సారించారట. ఆ చూపుతోనే కె.ఎస్.గారు పూర్తిగా స్తబ్ధత చెందారు. ఆ అనుగ్రహపూర్వక స్థితి దాదాపు మూడు వారాలు కొనసాగింది. అలాగే, 1949 సం॥లో కె.ఎస్.గారు క్రొత్త హాల్ ప్రవేశ ద్వారం దగ్గర కూర్చుని, భగవాన్ వైపు చూస్తూ, ఎందుకు ఇన్నాళ్ళ నుండి వస్తున్న తనకు మహర్షి యథార్థ ధ్యానస్థితిని అనుగ్రహించలేదని చింతిస్తున్నారు. అలా ఆలోచిస్తూ, కళ్ళు మూసు కున్నారు. కొద్దిసేపటి తరువాత ఆయనకు హాలులో తాను ఒక్కరే వుండి, తీవ్ర ధ్యానంలో మునిగిపోయినట్లు దృశ్యం గోచరమైంది. అది ఒక అద్భుత అనుభవం.

తమ ఆశ్రమ సందర్శానాల సమయాలలో కె.ఎస్.గారు భగవాన్ యొక్క ఉత్కృష్ట జీవన విధానాలను అతి దగ్గరగా గమనించేవారు. మహర్షి కరుణ, భక్తులు, సందర్శకుల పట్ల అంతులేని ప్రేమ, అనురాగాలు; ఆశ్రమ కర్మచారులతో సహా అందరు సాధకులకు అద్వైత తత్వాలను తెలియజెప్పడం; అందరికి తరుణోపాయాలను సూచించి వారి ఆధ్యాత్మికపరమైన ఉన్నతికి దోహదపడడం; పశుపక్ష్యాదులతో సహా సకల జీవులను సమదృష్టితో ప్రేమించి, కరుణ జూపడం - ఈ అంశాలను అన్నింటినీ గ్రహించేవారు. అంతేగాకుండ తమ జీవితంలో అలాగే తు.చ. తప్పకుండ, మహర్షి ప్రత్యక్షంగా, పరోక్షంగా బోధించిన సూత్రాలను ఆచరణలో పెడుతూ తమ జీవితాన్ని వెళ్ళబుచ్చారు.

ఉద్యోగరీత్యా, మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో ఇంగ్లీషు అధ్యాప

కులుగా పనిచేస్తున్న రోజుల్లో అమెరికా వెళ్ళి ఇండియానా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పట్టాను తీసుకునే అవకాశం లభించింది. స్వదేశం తిరిగివచ్చిన డా॥ కె.ఎస్.గారు హైదరాబాదులోని కేంద్రీయ ఆంగ్ల, ఇతర విదేశీ భాషా సంస్థలో అధ్యాపకులుగా చేరి, ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

ఇక అప్పటి నుండి డా॥ కె.ఎస్.గారు హైదరాబాద్‌లో రమణ మహర్షి తత్వాన్ని తెలుసుకోవాలని హృదయపూర్వకమైన ఆసక్తిని కనబరచిన వ్యక్తులకు ఆ విషయంలో సూచనలు, సలహాలు, ఇచ్చే కార్యక్రమంలో నిమగ్నులయ్యారు. తొలి రోజుల్లో బహుకొద్ది మంది సభ్యులతో మొదలైన రమణ సత్సంగం దినదినాభివృద్ధి చెంది, రమణ కేంద్రంగా భక్తులను, ఉత్సాహవంతులను ఆకర్షించింది. ఆదివారాల సత్సంగంతో మొదలై, క్రమంగా భక్తుల ఇళ్ళలో ఇతర రోజులలో సత్సంగ కార్యకలాపాలు జరిగే స్థాయికి ఎదిగింది. ఒక ప్రక్క ఉద్యోగ, కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే, డా. కె.ఎస్. గారు రమణ మహర్షి తత్వబోధన వివరణలలో పూర్తిగా నిమగ్నం అయ్యేవారు. తమ ఆరోగ్యం సంగతి పట్టించుకోకుండ, మహర్షిని గురించిన భాషణలను ఇస్తూ, అనేకమంది హృదయాలలో 'రమణ భక్తి' బీజాన్ని నాటారు. తాము ప్రతివారం ప్రసంగించడమే గాక ఇతర సభ్యులను మహర్షి భోధన అంశాలను గురించి ప్రసంగించమని ప్రోత్సహించేవారు.

పత్రికలు, తమ రచనల ద్వారా రమణ మహర్షి బోధనలు, వారి రచనలను గురించిన విషయాల వ్యాప్తిలో డా॥ కె.ఎస్. మరొక వైపు వ్యాసాలు, ప్రసంగాల రూపంలో తోడ్పడ్డారు. డా. కె.ఎస్. గారు రమణాశ్రమం యొక్క త్రైమాసిక పత్రిక 'మౌంటెన్ పాత్'లో రచనలు చేయడమే గాకుండ, దాని సంపాదకత్వం కూడ కొన్నాళ్ళు నిర్వహించారు. వారి ఇతర రచనలలో 'ద యునీక్‌నెస్ ఆఫ్ భగవాన్', అక్షరమణ

మాలపై వ్యాఖ్యానం, వంటివి పేర్కొనదగినవి. తిరువణ్ణామలైలోని శ్రీరమణాశ్రమం వారు తాము ప్రచురించిన రమణుల రచనలను, భోధనలను, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను కేంద్రంలో కూడ లభింప జేయడంతో ఇక్కడి భక్తులకు అవి అందుబాటులోకి వచ్చాయి. కార్యక్రమాలు హైదరాబాదుకే పరిమితం కాకుండ, ఇతర ప్రాంతాల భక్తుల సౌకర్యార్థం డా. కె.ఎస్. గారు 'శ్రీరమణ జ్యోతి' అన్న ద్విభాషా (తెలుగు, ఇంగ్లీషు) మాసపత్రిక స్థాపనకు పునాది వేశారు. సరళమైన భాషలో రచించబడిన వ్యాసాలతో ఈ పత్రిక భక్త జనాదరణను పొందుతోంది. రమణాశ్రమం ప్రచురణలను కొన్నింటిని తెలుగులోకి అనువదించి మహర్షి అద్వైత తత్వ ప్రాచుర్యానికి కూడ కేంద్రం కంకణం కట్టుకుంది. ప్రధానమైన ఘట్టాలు - మహర్షి జన్మదినం, వారి అణ్ణామలై రాక, వర్ధంతి, కృత్తికాదీపోత్సవం వంటి సందర్భాలలో ప్రత్యేక సత్సంగాలు జరిగే ఏర్పాటు శ్రీరమణ కేంద్రం చేస్తోంది.

ఇలాంటి బహుముఖీయమైన కార్యక్రమాలను నిర్వహించి, రమణ మహర్షి బోధనలను వ్యాప్తి చెందించడానికి అంకురమైన శ్రీరమణ కేంద్రాన్ని హైదరాబాదులో స్థాపించి దాని ఎదుగు, అభివృద్ధులకు తోడ్పడిన డా. కె.ఎస్.గారు తీవ్ర అనారోగ్యంతో జనవరి 11, 1998 సం॥లో దేహాన్ని చాలించారు. భౌతికంగా వారు లేనప్పటికి, ఇన్నేళ్ళు వెన్నుదట్టి, ప్రోత్సహించి, ఆది నుండి అభివృద్ధి దిశలో కేంద్రాన్ని పయనింపజేసిన డా. కె.ఎస్.గారికి జన్మ జన్మలు, కేంద్రం, కేంద్ర సభ్యవర్గం లబ్ధిపొందిన రమణ భక్తలోకం, ఋణపడి వుంటుంది. డా. కె.ఎస్. గారి సమయాన్ని ఈ కార్యక్రమాలకు వినియోగించడానికై ఉదారంగా కష్టనష్టాలను ఓర్చుకున్న వారి కుటుంబ సభ్యుల త్యాగాన్ని కేంద్రం ఎన్నటికి మరువజాలదు.

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

## నే నెవరను?

నేను 'సత్', 'చిత్', 'ఆనందము'గా భాసిల్లు ఆత్మ స్వరూపుడను. సర్వజ్ఞుడను సర్వసాక్షిని. జాగ్రత్ స్వప్న-సుషుప్తావస్థలతో నాకు మమైకత్వము లేదు. అవి వచ్చి పోవుచుండును. నాకు సత్యము గోచరించినది. నేను దివ్యాంశ సంభూతుడను.

మనస్సు పోకడలతోనూ, ప్రాణశక్తి యొక్క ఒడిదుడుకులతో నిమిత్తము లేని నేను, యిటు సంతోషమునకు గాని, అటు దుఃఖము నకు గాని, చలించువాడను కాను. ఇవన్నియును జీవాత్మ యొక్క మానసిక స్థితిగతుల ననుసరించి ఏర్పడు జాగ్రత్, స్వప్నావస్థల వంటివి. జాగ్రదవస్థలో అట్టి వానిని 'విశ్వ' అనియు స్వప్నావస్థలో 'తైజస్వ' అనియు, నిద్రావస్థలో 'ప్రజ్ఞ' అనియు ఉదహరింతురు. తెలియవలసిన సత్యము తెలుసుకున్న నాకు, యీ అవస్థలన్నియు అసత్యములే. మనస్సు యొక్క వాసనాఫలితములే. వీటి వల్ల నా నిజస్థితి మరుగుపడిననూ, నేను ఆత్మ స్వరూపుడనే.

నా వునికి యిప్పటికీ, యెప్పటికీ ఒక్కటే. నన్ను కొత్తగా పొందుట కానీ, కొత్తగా కనుగొనుట కాని జరుగదు. ఆ విషయంలో నాకెట్టి అపోహలూ లేవు. నేను అజుడను, మృత్యువు నన్ను కబళించజాలదు. మృత్యువన్న ఈ దేహము, సూక్ష్మ శరీరము, కారణ శరీరము

నశించుటయే కాదు. అనాత్మను ఆత్మగా పరిగణించుటయే మృత్యువు. ఈ కుహనాభావమే ప్రమాదము. ఈ ప్రమాదమే మృత్యు హేతువు. ఇదే శ్రీమహర్షి బోధన.

ఈ దేహాత్మ భావనను నశింపజేయు విచక్షణయే అమృతత్వము నకు దారితీయును. ఈ అమృతత్వము యెంతో కాలము తపస్సు చేయుట వల్ల వచ్చునది కాని, యెంతో కాలము వేచి యుండుట వల్ల లభ్యమగు వస్తువు కాదు. అది 'యిక్కడే', యిప్పుడే' లభ్యమగును. ఈ విచక్షణా ఫలితముగా నన్ను నేను సంబాళించుకొని 'నేనెవరను' అని ఆత్మ విచారమార్గమున పయనింతును. ఈ విచార ఫలితముగా, సద్గురువు విశదీకరించిన చందమున నిత్యప్రకాశమగు ఆత్మయే నా మూలమగు 'నే'నని గుర్తించెదను. ఈ విచారణ సరియైన దారిలో పయనించుట మాత్రమే చివరి గమ్యము ఆ పరిపూర్ణ స్థితి చేరు కొనుటయే. ఆ స్థితిలో యింక యెట్టి విచారణ గాని వుండదు.

నా మార్గమునకు చివరి గమ్యము నేనే. నా నిజస్వరూపమును నేను తెలుసుకొనుటకు అడ్డంకిగా ఒక తెర మరుగుపరుచున్నది. గురు కృప వలన తెరలన్ని తొలగింపబడినవి - లోపలి తెరలు, బయటి తెరలూ అన్నీ! నిర్భేద్యమయిన తురీయ స్థితిలో, నా నిజ స్థితిలో నేను పదిలముగా ఉప విష్ణుడనై వున్నాను. ఈ స్థితిని నాల్గవ స్థితిగా వర్ణించినను, మన ఉనికికి అదియే మూలము, అదియే ప్రథమము. ఈ తురీయ స్థితి, సద్గురువు నిజస్థితితో మమేకమైనప్పుడు పరిపూర్ణత్వము సుస్థిరమగును.

'నేను' హృదయాన్ని. ఏకమైన అనంతమయిన 'నేనే' నేను.

**ఆత్మను ఎక్కడ కనుగొనగలము?**

గాఢ నిద్ర (సుషుప్తి)లో వున్నప్పుడు ఆత్మ పరిపూర్ణమయిన విశ్రాంతిని, ఆనందాన్నీ అనుభవిస్తుంది. ఆ స్థితి నుండి బయటకు వచ్చినప్పుడు ఎంతో ఉత్తేజముగనూ, ఉత్సాహపూర్వకముగానూ ఉండును. సుషుప్త్యావస్థలో, విశ్రాంతిని అనుభవించుటయే ఆత్మ స్థితి.

ఆ స్థితి యేమిటి? అదే ఆత్మ-ప్రత్యగాత్మ. ఎట్టి బాహ్య వస్తువులతో కలుషితము చెందని సాక్షి స్వరూపము-ప్రజ్ఞ-ఆత్మానుభూతి. ఇదే శాశ్వత మయిన సత్యము. మన నిజస్వరూపమునకు పునాది. జాగ్రత్-స్వప్న- సుషుప్త్యావస్థలు అన్నియు యీ సత్య స్థితి సన్నిధిలో పరిక్రమించును. హృదయ స్థానములో వుండి 'నేను' అను ప్రకాశించు స్థితియే మన నిజస్థితి.

అన్ని అవతారముల మూలమును, ఆత్మగా గ్రహించగలమనునది శ్రీ భగవాన్ బోధన. ఆ స్థితి నిశ్చలము. హృదయాంతరాళములో అనుభవించగల యీ ఆత్మానుభూతి అనిర్వచనీయము.

ఈ ఆత్మ సందర్శనము కలిగినప్పుడే పరిపూర్ణమయిన అద్వైతానుభూతి కలుగును. అప్పుడే నిష్కామకర్మ సాధ్యమగును. ఆ స్థితిలో మనము చేయు పనులన్ని సహజ ధర్మములు గానూ, అప్రయత్నములుగా గోచరమవుతాయి. అవే విశ్వ ధర్మముగా గోచరమవుతాయి. అదే ధర్మముగా అనుభవైక్యమగును. బాహ్య ప్రపంచమునకు, అంతరానుభూతికీ సమన్వయము సుస్పష్టమగును. ఆ సమగ్ర జీవితము పూర్ణ భక్తికి, సంపూర్ణమయిన జ్ఞానానికీ నిజమైన యాగానికీ మూలస్తంభమగును.

*(సశేషం)*

# భగవాన్ స్వప్న దర్శనం

- ఐ.ఎస్.ఆర్. శర్మ

ఇప్పటివరకు భగవాన్ సంపర్కంలోకి వచ్చిన వారందరు ఒక్క సారైన రమణాశ్రమం వెళ్ళి వచ్చివుంటారు. నాకు తెలిసిన భగవాన్ నన్ను గత 30 సంవత్సరాలుగా అనుగ్రహిస్తున్నారు. అయితే ఒక్కసారి కూడ నేను రమణాశ్రమం పోలేదు. ఈ బాధ నన్ను బాగా వెంటాడుతుండేది. ఒక రోజు ఈ బాధతో ఏడుస్తూ పడుకున్నా, రాత్రి 12 గంటల సమయం. నిద్ర పట్టింది. అద్భుతమైన కల.

రమణ సమాధి మందిరం, రమణలింగం, ఆ వెనుక రమణమహర్షి విగ్రహం. సమాధి మందిరం చాలా బాగుంది, రమణ విగ్రహం చుట్టూ ఒక గొలుసు కట్టబడి వుంది. అది దాటి లోపలికి వెళ్ళకూడదు అని అర్థం కాబోలు, నేను గొలుసు బయట నుంచొని ఉన్నా. ఎంత ఆనందం. ఇంకేదో ఉత్కంఠ. ఒక పూజారి పండితుల వారు నుంచొని ఉన్నారు. మొత్తం హాలులో ఇంకెవరూ లేరు. ఆ పూజారిగారు నన్ను చూసి తెలుగులో, ''ఆయన ఆజ్ఞతో వచ్చినవాడివి, అనుమానం ఎందుకు, లోపలికి వెళ్ళు'' అన్నారు. ఇక ఎక్కడ లేని ఆనందం. గొలుసు దాటుకుని ఒక్క ఉదుటున లోపలికి వెళ్ళా. లింగం దాటి విగ్రహం దగ్గరికి వెళ్ళా.

విగ్రహాన్ని కౌగిలించుకొని, అంతా తడిమేస్తూ, ''స్వామీ, స్వామీ'' అని ఏడ్చేస్తున్నా. విగ్రహం తొడల మీద చేతులు పెట్టి ఆయన ముఖానికి నా ముఖం ఆనించి, కళ్ళు మూసుకొని తన్మయత్వంలో ఉన్నా. ఇంతలో స్వామి తొడ మెత్తగా తగిలింది. మొహం కూడ మెత్తగా ఉంది. విగ్రహం గట్టిగా ఉంది కదా, ఇప్పటి వరకు? తేరుకొని కళ్ళుతెరిచి

చూశా. నల్లరాయి విగ్రహం బదులు స్వామి దివ్య మంగళరూపం మెరిసిపోతోంది. ఇక్కడ స్వామి రంగును చూస్తుంటే, ఒక విషయం చెప్పొచ్చు. శ్రీసూక్తం అమ్మవారి రంగును 'సువర్ణరజతస్రజాం' అని చెబుతుంది. బంగారము, వెండి కలిస్తే ఏ రంగు వస్తుందో అమ్మవారి రూపం అలా ఉందిట. ఇక్కడ మన భగవాన్ రంగుకూడ అలాగే ఉంది. ఇహ నా ఆనందం గురించి చెప్పలేను. బహుశః ఇటువంటి పరిస్థితినే ఉపనిషత్, "యతో వాచోనివర్తంతే అప్రాప్య మనసాసః" అంటుంది. అంటే ఎప్పుడైతే నోరు మాట్లాడలేదో, మనసు ఆలోచించలేదో అది.... తదేకంగా మొహంలోకి చూస్తున్నా... కళ్ళు, అటు, ఇటు తిప్పాను. కనురెప్పలు మూసి తెరిచాను. మళ్ళీ ఆ రూపాన్ని కౌగలించుకున్నా, మరికాస్సేపట్లో విగ్రహం! మెలకువ వచ్చింది.

**మరణభీతిని జెందు మానవులిలను**
**మరణభవరహిత పురనిర్మథనుని**
**చరణమే పొందగలరు శరణముగ;**
**మరణింపఁగ నహముఁ జిరసంగములను**
**మరణహీన బ్రహ్మములగువారు**
**మరల నొందఁగలరె మరణ చింతనను?**

*(మూలం: ఉన్నది-నలుబది-సర్వేద్య)*

# భగవాన్ రమణుల దైవిక లీలలు

- విడపనకంటి

## 7. గురువు పట్ల అమర్యాద తగదు

ఒకరోజు కుంజుస్వామి భగవాన్‌కు తాను కోవిలూర్ మఠానికి వెళ్ళి వచ్చిన సంగతి చెబుతూ "కోవిలూర్ మఠాధిపతి శ్రీమహాదేవస్వామి భగవాన్ గురించి, ఆశ్రమంలోని ఇతర భక్తుల క్షేమ సమాచారాలను గురించి విచారించారు. నేను అక్కడ ఉన్నప్పుడు రాజా శ్రీ అణ్ణామలై చెట్టియారు మఠానికి వచ్చారు," అని అన్నాడు. చెట్టియార్ ఏమి చేశారని భగవాన్ ప్రశ్నించారు. జవాబుగా కుంజుస్వామి "చెట్టియార్ తన పై కండువాను నడుముకు కుట్టుకొని పూర్తి నమ్రతతో సాష్టాంగ ప్రణామము చేశారన్నాడు.

అప్పుడు భగవాన్ కుంజుస్వామితో, "నీవు కూడ అలాగ ప్రణామం చేశావా? అన్నారు. "లేదు, నేను చేయలేదు. మిమ్మల్ని ఏకైక గురువుగా భావించిన తరువాత మరెవరికీ ప్రణామం చేయాలని నాకు అనిపించదు" అని జవాబు ఇచ్చాడు. కోపగించిన భగవాన్ పరుష స్వరంతో "ఓహో! నీకు భగవాన్ అంత బాగా తెలుసునన్న మాట. చాలా తెలివి గలవాడివి! ఈ సోఫాలో ఉండే అయిదడుగుల విగ్రహం మాత్రమే భగవాన్ స్వరూపమనుకొంటున్నావు. భగవాన్ ఈ హాలుకు మాత్రమే పరిమితుడై ఉన్నాడా? మరెక్కడ ఉండలేదా? నీ భక్తి అంత గాఢంగా, ప్రత్యేకించి భగవాన్ పట్ల మాత్రమేనని అనుకుంటూ వుంటే, అసలు ఇతర చోట్లకు వెళ్ళడమెందుకు? మఠానికి వెళ్ళినప్పుడు అక్కడి మర్యాదలను పాటించాలి కదా?

"నీవు ఎక్కడికి వెళ్ళినా, ఎవరికి ప్రణామం చేసినప్పటికి, అది నీ గురువుకు ప్రణామం చేయడంతో సమానమే".

## 8. జీవన సూత్రము

పాతహాలు నిర్మాణం తరువాత కొంతకాలం వరకు వంటపని కూడ అక్కడే జరిగేది. పొగ బయటికి వెళ్ళడానికి ఒక చిమ్నీ ఏర్పాటు చేయబడింది. చిమ్నీకి చుట్టూ నాలుగువైపుల ఇనుప రేకులు బిగించారు. క్రింద మాత్రం పొగపైకి పోయే మార్గం వుండేది. ఒకరోజు, ఒక అందమైన పక్షి ఎలాగో లోపలికి వచ్చి, ఆ చిమ్నీలో దూరి, లోపల చిక్కుకుంది. దానికి బయటపడే మార్గం కానరాలేదు. ఆ చిమ్నీ లోపలే పైకి ఎగరడానికి రెక్కలు కొట్టుకుంటూ, మరింతపైకి వెళ్ళే ప్రయత్నం చేసింది. కాని ఫలితం కనిపించలేదు. "దానిని అలా వదిలెయ్యండి. ఎలాగో ఒకలాగ బయటపడే మార్గం కనుగొంటుంది" అని భగవాన్ అన్నారు.

చివరికి పక్షిపైకి వెళ్ళే ప్రయత్నం మానుకొనడంతో చిమ్నీ అడుగున రంధ్రం వరకు జారింది. అలా బంధం నుండి బయటపడి, హాలు బయటికి ఎగిరిపోయి ఆకాశంలో స్వేచ్ఛగా విహరించింది. అప్పుడు భగవాన్ ఇలా వివరించారు:

"పక్షికి ప్రకృతిసిద్ధమైన నివాసం విశాల ఆకాశం. కాని అది ప్రమాదవశాత్తు, ఇరుకైన చిమ్నీలో వచ్చి చేరింది. తాను వచ్చిన మార్గం మరచిపోయింది. చిమ్నీలోపైకి ఎగబ్రాకుతున్న కొద్దీ, మరింత తబ్బిబ్బై భయపడింది. ఎప్పుడు పెనుగులాట మాని తనను తాను జారుకోనిచ్చిందో, బయటికి వెళ్ళే త్రోవ గుర్తించి, బయటపడి, తిరిగి ఆకాశంలోనికి ఎగిరిపోయింది.

''జీవుడు కూడ పక్షివంటి వాడే. శరీరంతో మమేకం అయ్యేసరికి, తాను యథార్థానికి పరిమితులు ఎరుగని స్వేచ్ఛాజీవినన్నది మరుస్తాడు. మొదట పక్షి ప్రయత్నాలన్నీ త్రోవ కనుక్కొనడంలో పైపైకి వెళ్ళసాగింది. అలాగే జీవుడు కూడ లౌకిక జీవనంలోని హద్దులను వదిలించుకునే తప్పుడు ప్రయత్నాలలో పడి కర్మబంధాలలో మరింతగా చిక్కుకుని పక్షి తప్పించుకునేందుకు తన ఎగరగల శక్తిని ఒక పనిముట్టుగా చేసుకొనే ప్రయత్నం ఎలా చేసిందో, జీవుడు చర్యలను (కర్మలను) జరిపే తన సహజ లక్షణాన్ని ఉపయోగించి కర్మ నుండి బయటపడ డానికి ప్రయత్నిస్తాడు.

''పక్షి ఎగరడానికి చేస్తున్న అన్ని ప్రయత్నాలను ఎప్పుడు మానివేసిందో, అలాగే జీవుడు తన లౌకిక చర్యలను కొనసాగించకుండ, ఎప్పుడు స్థిరంగా వుంటాడో, అప్పుడు అతనికి అన్ని బంధాల నుండి విముక్తుడయ్యే మార్గం తెలియవస్తుంది''.

## 9. అందరిలో ఆ అరుణాచలుడే!

ఒకసారి మిట్టమధ్యాహ్నమప్పుడు చెట్లను కొట్టే కూలీలు కొందరు స్కందాశ్రమానికి వచ్చారు. వారు అలసిపోయి ఆకలితో అల్లాడు తున్నారు. ఆ సమయంలో భగవాన్ ఆశ్రమం బయట కూర్చున్నారు. వాళ్ళు భగవాన్ దగ్గరికి వచ్చి, దీనంగా, ''స్వామీ! చాలా ఆకలిగా వుంది. మాకు తినడానికి ఏమైన ఇవ్వండి'' అని వేడుకున్నారు. కుంజుస్వామి వైపు తిరిగి, ''ఇప్పటికే అమ్మ వండి వుంటుంది. ఆకలితో వున్న వీళ్ళకు తినడానికి ఏమైన ఇవ్వమని ఆమెను అడుగు'' అని భగవాన్ అన్నారు.

ఆ రోజుల్లో ఆచారాలను పాటించే బ్రాహ్మణులు ముందే నిమ్న వర్ణాలవారికి ఆహారం పెడితే అది మైలపడుతుందని నమ్మేవారు.

భగవాన్ తల్లిగారు సంప్రదాయాలను ఆచరించే స్త్రీ. తాము ముందు తిన్న తరువాతనే బ్రాహ్మణేతరులకు పెట్టాలన్న ఆచారాన్ని గట్టిగా పాటించేది. అందుకే కుంజుస్వామి వెళ్ళి కూలీలకు ఆహారాన్ని ఇవ్వమని అడిగితే, “నేను ఇంకా తినలేదని భగవాన్‌తో చెప్పు” అని తిరిగి పంపారు. అదే విషయాన్ని కుంజుస్వామి భగవాన్‌కు చెప్పారు.

వెంటనే, భగవాన్ లోపలికి వెళ్ళి, తల్లి చేయి పట్టుకుని బయటకు తీసుకొచ్చారు. ఆమెతో, “వీళ్ళను చూడు. ఎంత ఆకలితో వున్నారో నీకు కనిపిస్తోందా. నీకంటే వాళ్ళు వేరు అని తలుస్తున్నావా? నిజం ఏమిటంటే, వీరందరూ అరుణాచలుని రూపాలే. ఉన్నది ఒకే ఒక్క అరుణాచలుడు. ఆయన సృష్టిలోని ప్రతిదానిలోను ఆయన వుంటారు” అని సెల విచ్చారు.

**10. ప్రతి ఒక్కటి ఆయన ఆధీనంలోనే**

రంగస్వామి అయ్యంగార్ ఒక రోజు భగవాన్ దగ్గరికి ఒక వింత కోరికతో వచ్చాడు. “భగవాన్, మీరు ఒకప్పుడు నవరాత్రిలో ఒక రోజు పెద్ద గుడికి (అరుణాచలేశ్వర దేవాలయానికి) నామం (శ్రీ వైష్ణవ గుర్తు) మీ నుదిటిపై ధరించి వెళ్ళారని విన్నాను. ఈ రోజు మీరు అలాగ చేయండి. దయచేసి నా ఈ కోరిక తీర్చండి” అని బ్రతిమాలాడు. భగవాన్ “సరే, ముందు నాయన (గణపతిముని) అలా చేస్తే నేనూ చేస్తాను” అన్నారు.

నాయనను అలా చేయడానికి ఒప్పించలేమని అందరికి తెలుసు గనుక వాళ్ళు నవ్వారు. కాని భగవాన్ మాత్రం “నాయన భోజనశాలకు వచ్చేసరికి, ఆయన ఆకు ప్రక్కన ఒక ఎర్ర, ఒక తెల్లని సుద్దముక్కలను ఉంచండి” ఆయన నామాన్ని ధరిస్తే, నేను కూడా అలాగే చేస్తాను”

అన్నారు. భగవాన్ ముఖకవళికలలో రంగస్వామి అయ్యంగార్ ఏమి గమనించాడో గాని తన అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకున్నాడు. భగవాన్ చెప్పినట్లు చేసి, ఏమి జరుగుతుందో చూద్దామని మౌనంగా వేచి వున్నాడు.

నాయన భోజనశాలలోనికి వచ్చి కూర్చున్నాడు. భగవాన్‌తో సంభాషణ మొదలుపెట్టిన ఆయన, ఆ ధోరణిలోనే అన్నీ మరచి పోయారు. తాము ఏమి చేస్తున్నారనే ధ్యాస లేకుండ, తమ ఆకు ప్రక్కన వున్న రెండు సుద్దముక్కలను తీసుకొని నుదుటిపై నామం పెట్టుకున్నారు. వెంటనే భగవాన్ కూడ అదే పనిని చేశారు. కాస్సేపటి తరువాత ఉన్నట్లుండి భగవాన్ నుదుటిపై శ్రీవైష్ణవ నామం చూసి ఆశ్చర్యంతో, "ఇదేమిటి? ఎప్పటి నుండి మొదలు పెట్టారు ఈ అలవాటు?" అని అడిగారు. అమాయకంగా భగవాన్, "మిమ్మల్ని చూసిన తరువాతనే!" అని జవాబిచ్చారు. అప్పటికీ, నాయనకు బోధపడ లేదు. భగవాన్ "నాయనకు ఒక అద్దం తెచ్చియివ్వండి" అన్నారు. అప్పుడు నాయనకు తనతో ఆ పనిని ఎంతో తెలివిగా చేయించారని అర్థం అయింది.

**శ్రీరమణుల 138వ జయంతి జనవరి 7వ తేదీన శ్రీరమణ కేంద్రమునందు ఉదయం 9.00-11.45 గంటల వరకు జరుపబడును.**

**జనవరి 11వ తేదీ సాయంత్రం 6.00-7.30 గం॥ల వరకు డా॥ కె. సుబ్రహ్మణియన్ గారి 20వ సంస్మరణ దినోత్సవము జరుపబడును.**

# కదలని తెర - అసలు నేను

- దోనెపూడి వెంకయ్య

తెరపై చిత్రాలు ఉంటాయి. చిత్రాలలో తెర ఉండదు. అలాగే నాలో శరీరం ఉంది. శరీరంలో నేను లేను. చిత్రాలు తెరను విడిచి ఉండవు. తెర చిత్రాలకు ఆధారం, చిత్రాల కంటె భిన్నము. అలాగే జగత్తు నన్ను విడిచి ఉండదు. నేను జగత్తుకు ఆధారము, జగత్తు కంటె భిన్నము. తెరను చూస్తే, తెరమీది చిత్రాలు చూడము. చిత్రాలను చూస్తే తెర కన్పించదు. అలాగే నన్ను నేను చూస్తే, దృగ్దశ్యరూపంగా జగత్తు గోచరింపదు. జగత్తును చూస్తే నేను నన్ను చూడలేను. తెర కదలదు. కదలని తెరపై చూచేదంతా మాయ. అలాగే నేను కదలను. కదలని నాలో జీవ జగదీశ్వర రూపంగా కన్పించేదంతా మాయాశక్తి విలాసము.

తెర ఎక్కడ ఉన్నదో అక్కడే ఉంటుంది, ఉన్నట్లుంటుంది. చిత్రాలు వస్తాయి, పోతాయి. అలాగే నేను ఎక్కడ ఉన్నానో అక్కడే ఉన్నాను; ఉన్నట్లున్నాను. జగద్దృశ్యాలు వస్తాయి, పోతాయి. సమస్తమూ తనపైన గోచరించేందుకు అవకాశం యిస్తుంది తెర. అలాగే ఆకాశం వలె అన్నీ నాలో ఉండేందుకు అవకాశం యిస్తాను నేను.

తెరమీది చిత్రాలు ఫిల్ము ద్వారా కల్పితాలు. నాలోని జీవ జగదీశ్వరులు మనః కల్పితాలు, వాసనా ప్రేరితాలు. తెరమీది చిత్రాలు తెరను ప్రభావితం చేయవు. నాలో తోచే జాగ్రత్ స్వప్న సుషుప్తులు నన్ను ప్రభావితం చేయవు. చిత్రములున్నా, లేకపోయినా తెరకేమీ అంటదు. అవస్థాత్రయము తోచినా, తోచకపోయినా నాకేదీ అంటదు. తెర చిత్రాలు, ప్రేక్షకులు, వెలుగు, ఫిల్ము - అన్నీ తెర లోనివే. అలాగే దృగ్దృశ్య దర్శన రూపమయిన త్రిపుటులు నాలోనివే.

సినిమాలో చూచే దేశకాలములు తెరకు అన్వయించవు. అలాగే

నాలో తోచే దేశకాలాలు నాకు అన్వయించవు. నేను సర్వత్ర, సర్వమై ఉన్నాను. తెరజడము కాబట్టి తెరను చూచే ద్రష్టవేరుగా ఉంటాడు. కాని నేను చిత్ప్రకాశరూపుడను కాబట్టి ద్రష్ట దృశ్యములు నేనే అయి ఉన్నాను. చిమ్మచీకటి లోనూ, పట్ట పగటి వెలుతురులోను సినిమా చిత్రాలు కనిపించవు. అలాగే నిద్రలోనూ, జ్ఞాన దశలోను జగదృశ్యాలు గోచరించవు. కొంచెము చీకటి, కొంచెము వెలుతురులోనే సినీచిత్రాలు కన్పిస్తాయి. అలాగే అవిద్య తమస్సు అయిన మనస్సుకే జగత్తు గోచరిస్తుంది. జ్ఞానరూపుడనయిన నాకు జగత్తు జగత్తుగా గోచరించదు.

తెర చిత్రాలున్నప్పుడూ ఉంటుంది; చిత్రాలు లేనప్పుడూ ఉంటుంది. అలాగే నేను వ్యవహార దశలోనూ, సమాధి యొక్క శాంత దశలోనూ ఉంటాను. శరీరమున్నా, లేకపోయినా నేను ఉండనే ఉంటాను. తెరను సినిమాలోని అగ్ని కాల్చదు, నీరు తడుపదు, గాలి శుష్కింప చేయదు, శస్త్రాలు ఛేధించలేవు. అలాగే 'నేను' తత్త్వము అచ్ఛేద్యము, అతాహ్యాము, అశోష్యము, అక్లేద్యము. సినీతెరపై ఒక మిథ్యా చిత్రం ఇంకో మిథ్యా చిత్రాన్ని చూస్తుంది. అలాగే చిద్రూపుడనైన నాలో జీవుడనే మిథ్యా దృశ్యం జగత్తు అనే మిథ్యా దృశ్యాన్ని చూస్తుంది.

సినిమాలోని ఒక నటుడు తెరలేకుండా నటించలేడు. అలాగే నాకు భిన్నంగా నాలో తోచే జీవుడు 'నేను' లేకుండా వ్యవహరించలేడు. సినిమాలోని నటుడి దుఃఖం తెరకు అంటదు. అలాగే నాలో తోచే మిథ్యా రూపుడైన జీవుని దుఃఖం నన్ను అంటదు. చిత్రాలు తెరకాదు. అందుచేత చిత్రాల నుండి తెరకు విముక్తి కలగటం అనే ప్రశ్న లేదు. తెర చిత్రాలతో సంబంధం లేని నిత్య ముక్త రూపము. అలాగే దేహమునకు కాదు. అందుచేత జీవన్ముక్తి, విదేహముక్తి ఇవి లభించడ మనే ప్రసక్తి నాకు లేదు. నేను నిత్య ముక్తస్వరూపుడను.

## Desire is digesting us; Time is 'spending' us!

(Dr.K.Subrahmanian - Talk No. 4A)

In Upadesa Saaram, Bhagavan says this about the Yogi who has succeeded in losing his ego:

**नष्ट मानस उत्कृष्ट योगिनः ।**
**कृत्यमस्ति किं स्वस्थितिं यतः ।।**

*Nashtamaanasa - utkrishtayoginah*
*Krityamasti - kim swastihtim yatah.*

Swastithi means the real *sthitih* or state. That is, being one's own Self. *Swa* in Sanskrit means one's own. *Swa-bhava* is your own real bhava- what you are born with.Similarly, Swami is one who has complete control over oneself. If I have control over myself, I don't need anything, and I don't need to do anything. This is what this verse means. If I reach a stage where I don't have any desires, I have no compulsion to do anything. We all do so many things in this world because we all have so many desires, be it spiritual, be it material, be it this or that. All the time we do something or other in order to fulfil our desires. In the fulfillment of our desires there is conflict, obstruction, pain or fear, and there is a sense of despair till it is achieved. Even the happiness we get when we reach our goal lasts only for a short period as we have another desire. And so, our whole life is spent in trying to get something or the other. We are so interested in getting hold of something outside of ourselves that we don't have time to take hold of ourselves. In other words, everybody is interested in getting hold of things from outside; very few are interested in getting control over themselves. *Nashta-manasah* refers to a person who has completely destroyed his ego. *Utkrishta yoginah* refers to great yogis or jnanis. A person who has completely destroyed his ego is a real jnani.

*Kritymasti kim*: if one has no desires because one has destroyed one's ego, what is there for him to do? These yogis are in *Swa-stithi* that is, they abide in the Self.

It is very difficult to imagine that state with our mind because in that state there is no mind - which is a matter of experience not of explanation. Bhagavaan says that it is a state everyone can experience. Everyone can become a swami. And everyone becomes a swami at least for a few hours everyday, when we are in deep sleep. In deep sleep we are not conscious of the body, of our wealth, fame, name and so on. The mind does not operate there but you are extremely happy. Bhagavan says that, if this is your state in your waking period, even though you have a mind, your attitude to the problems will be very different. This is where Bhagavaan's life is of great significance to us. If we have that attitude, whatever you may have you will be content with it and whatever happens, you will not worry. If a man does not worry at all in this world, then he is a jnani.

